ప్రజాశక్తి
గురువారం 20 జూన్ 2024
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

పోలీసు పైరవీ?



- నచ్చిన చోటకు వెళ్లేందుకు సిఫార్సు లేఖలు
- ఎమ్మెల్యేల ప్రసన్నంలో కొందరు ఎస్ఐ, సిఐలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కూటమి ప్రభుత్వంలో నచ్చిన చోటకు వెళ్లేందుకు పోలీసులు, నచ్చిన వారిని తెచ్చుకొనేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నాలు ఆరంభించారు. కావాల్సిన స్టేషన్‌కు వెళ్లడానికి ఎమ్మెల్యేలను కొంతమంది పోలీసు అధికారులు ప్రసన్నం చేసుకుంటున్నారు. వైసిపికి తామెప్పుడూ అనుకూలంగా పనిచేయలేదని ఎమ్మెల్యేల వద్ద విధేయత చూపిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఎస్ఐ, సిఐల నుంచి పైస్థాయి పోలీసు అధికారులను మార్చే ఆలోచనలో ఉంది. వైసిపితో సానుకూలంగా ఉన్నవారు, తమకు అనుకూలంగా పనిచేసే వారి జాబితా ఎమ్మెల్యేలు తయారుచేస్తున్నట్లు తెలిసింది. కొంతమంది పోలీసు అధికారులు మారిన ప్రభుత్వానికి తగినట్లు పనిచేసేస్తామని ఎమ్మెల్యేలకు భరోసా ఇస్తున్నట్లు సమాచారం. గతంలో టిడిపి కార్యకర్తల పట్ల కఠినంగా వ్యవహరించిన ఎస్ఐ స్థాయి నుంచి పై అధికారుల వరకు ప్రభుత్వం స్థానచలం చేయనున్న నేపథ్యంలో ఎస్ఐ, సిఐలు నచ్చిన చోటకు వెళ్లేందుకు ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని గెలిచిన వారంతా కూటమి ఎమ్మెల్యేలు కావడంతో తమకు కావాల్సిన వారిని నచ్చిన చోటకు బదిలీ చేసుకొనేలా వారు కసరత్తు చేస్తున్నారు. ఈ జిల్లాలోని పాయకరావుపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ద్వారా సిఫార్సు లేఖలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవిష్యత్తు బదిలీలకు మార్గం సుగమం చేయనున్నట్లు పోలీసుల్లో చర్చ సాగుతోంది.

వైసిపి ప్రభుత్వంలో రాజకీయంగా ఇబ్బంది పెట్టిన వివిధ స్థాయి పోలీసు అధికారులను ప్రాధాన్యతలేని చోటకు పంపించనున్నారు. పనిచేస్తున్న స్టేషన్‌లో కాలాన్ని ప్రాతిపదికగా తీసుకోకుండా, తమ పార్టీ, కార్యకర్తల పట్ల ఎలా వ్యవహరించారు? భవిష్యత్తులో ఎలా పనిచేస్తారన్న అంశాన్ని పరిగణలోకి తీసుకొని స్థానాలు మార్చనున్నారు. కావాల్సిన స్టేషన్‌కు వెళ్లేందుకు తెలిసిన మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీని పట్టుకొని సిఫార్సు లేఖలు తయారుచేసుకుంటున్నారు. సిఫార్సు లేఖలో ఎక్కడ నుంచి ఎక్కడకు బదిలీ చేయాలనేది కూడా పొందుపర్చుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం మారడంతో తమ స్థానం, ప్రాధాన్యత మారుతుందన్న ఆలోచనలో కొంతమంది ఎస్ఐ, సిఐలు ఉన్నారు.

డెంగీ, మలేరియాపై అప్రమత్తత

నగరంలో పెరుగుతోన్న పాజిటివ్ కేసులు
ప్రజా సహకారంతోనే నియంత్రణ సాధ్యం
జిల్లా మలేరియా నిర్మూలనాధికారి డాక్టర్ తులసి

ప్రజాశక్తి- సీతమ్మధార : డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ప్రజల సహకారం, భాగస్వామ్యం అవసరమని జిల్లా మలేరియా నిర్మూలనాధికారి డాక్టర్ తులసి అన్నారు. బుధవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డిఎంహెచ్ఒ డాక్టర్ పి జగదీశ్వరరావు ఆధ్వర్యంలో విలేకర్లతో మాట్లాడుతూ, నగరంలో ఇప్పటివరకు 202 మలేరియా, డెంగీ కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ జ్వరాలు, కీటక జనిత డెంగీ, మలేరియా వంటి వ్యాధులు క్రమక్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇంటి ఆవరణలో, సన్‌సైడ్, టెర్రాస్‌పై మంచి, మురుగునీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సెప్టిక్ ట్యాంకులు, ఖాళీ గొట్టాలకు నైలెన్ జాలీని కట్టుకోవాలన్నారు. దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందకుండా, అవి కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నిద్రించేటప్పుడు దోమతెరలు తప్పకుండా వాడాలని, పగటిపూట చేతులు, కాళ్లకు నిండుగా ఉండే దుస్తులు వేసుకోవాలని సూచించారు. చీకటి పడకముందే తలుపులు, కిటికీలు మూసేయడం ద్వారా దోమలు ఇంటిలోకి రాకుండా నివారించవచ్చున్నారు నగరంలో డెంగీ, మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ జరిగిన రోగులకు దగ్గరలోని యుపిహెచ్‌సిలో చికిత్స

మిగతా 2లో..



మాట్లాడుతున్న డిఎంఒ డాక్టర్ తులసి

కెజిహెచ్ ఘటనపై బాలల హక్కుల కమిషర్ సీరియస్
▶ వార్త 2లో..

విశాఖలో వెల్ఫేర్ బాధితుల నిరసన
▶ వార్త మెయిన్‌లో..

4వ జోన్‌లోని వాణిజ్య సముదాయాలకు 28న వేలం
▶ వార్త 2లో..

ఆహ్లాదకరంగా పార్కుల అభివృద్ధి : జివిఎంసి కమిషనర్
▶ వార్త 4లో..



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

25 స్కూల్ బస్సులపై కేసులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

నిబంధనలను ఉల్లంఘిస్తున్న స్కూలు, కాలేజీ బస్సులపై రవాణా శాఖ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం గంభీరం, సింహాచలం, వేపగుంట ప్రాంతాలలో విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేశారు. వివిధ రకాల నిబంధనలు ఉల్లంఘించిన తొమ్మిది బస్సులపై కేసులు నమోదు చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ రాజరత్నం మీడియాకు తెలిపారు. ఈ నెల 13 నుంచి బస్సుల తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇంతవరకు 25 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఒక బస్సును సీజ్ చేశామని వెల్లడించారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని తెలిపారు. ఈ రోజు తనిఖీలు నిర్వహించిన అధికారులు కె.ప్రవీణ్ కుమార్, ఎఎస్.గణేష్‌రెడ్డి, మాధవి రాజారావు తదితరులు ఉన్నారని తెలిపారు.



ధరాఘాతం

హడలెత్తిస్తున్న పప్పులు, కూరగాయలు
మధ్యతరగతి ప్రజల గగ్గోలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నిత్యవసరాల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి ఏం కొనేటట్టు లేదు... ఏం తినేటట్టు లేదు అన్న మాదిరిగా తయారైంది. పలు రకాల పప్పులు ధరలు భారీగా పెరిగాయి. పప్పుల ధరలతో పాటు ఉల్లిపాయలు, టమోట, పచ్చిమిర్చి, అల్లం వంటి కూరగాయల ధరలు కూడా భారీగా పెరిగాయి. దీంతో పేద మధ్యతరగతి ప్రజల ఆదాయంలో అధిక భాగం వీటి కోసమే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బ్రాండ్ బియ్యం ధరలు కూడా ఇటీవల విపరీతంగా పెరిగాయి.

ధరలను పరిశీలిస్తే... కిలో కందిపప్పు రూ.228, మినప పప్పు రూ.188, త్రీ హార్స్ మినపప్పు రూ.205, పెసరపప్పు రూ.165, శనగపప్పు రూ.136, పెసలు రూ.176, గోధుమ నూక రూ.70, ఇడ్లీ రవ్వ రూ.65, గోధుమ పిండి రూ.70, మైదా రూ.66, చింతపండు రూ.188, ఉప్పు టాటా కంపెనీ రూ.28గా ప్రస్తుతం ఉన్నాయి. రెండు నెలల ధరలతో పోలిస్తే ఇవి ప్రతి దానిపై కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు పెరిగాయి.

బ్రాండెడ్ బియ్యం ధరలు పైపైకి

మార్కెట్‌లో నాణ్యమైన

మిగతా 2లో..

బతకటం ఎలా

ఒకవైపు పప్పుల ధరలు, మరోవైపు కూరగాయల ధరలు ఒకదానితో ఒకటి పోటీపడి పెరిగిపోతుంటే, బ్రతకడం ఎలాగో తెలియక మదనపడే పరిస్థితి నెలకొంది. అన్ని రకాల పప్పులు కాకుండా, భారం అయినప్పటికీ కందిపప్పు మాత్రం కొనుగోలు చేసి తక్కువ మొత్తంలో వంటకు ఉపయోగించి కాలం గడుపుతున్నాం. కూరగాయలు కూడా తక్కువగానే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



పొలమరశెట్టి రాణి
అక్కయ్యపాలెం

మొదటి పేజీ తరువాయి..

ధరాఘాతం

వస్తువు దొరికితే వినియోగదారులు ఎగబడతారు. బియ్యం విషయంలో ఇది కాస్త ఎక్కువే కనిపిస్తుంది. ఓసారి అన్నం బాగుందని నిర్ధారణకు వచ్చాక ఆ బ్రాండ్ తప్ప మరొకటి ముట్టుకునేందుకు ఆసక్తి చూపరు. ఆ నమ్మకమే వ్యాపారులకు కాసులు పంట పండిస్తోంది. తాము చెప్పిందే రేటు అన్నట్లు, సిండికేట్లుగా మారి అమాంతంగా ధరలు పెంచేస్తున్నారు. విశాఖ నగరంలో పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. కొనక చస్తారా.... అన్నట్లు వినియోగదారుడి నమ్మకంపై దెబ్బ కొడుతున్నారు. నెలకు ఒకసారి రేటు పెంచేసి నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇటు మిల్లర్లు అటు కమిషన్ ఏజెంట్లు, టోకు వ్యాపారులు సామాన్య మధ్యతరగతి ప్రజలను మింగేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోవాల్సిన తూనికలు- కొలతలు, పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్, రవాణా శాఖ, వాణిజ్య పన్నుల శాఖలు కళ్లు మూసుకుంటున్నాయి. నగర మార్కెట్లో బియ్యంలో ప్రధాన బ్రాండ్ల సరుకు డిమాండ్ అధికంగా ఉంది.

జిఎస్‌టి మినహాయింపు కోసం 25 కిలోలకు బదులు, 26 కిలోల బియ్యం బస్తాలను అమ్మకాలు చేస్తున్నారు. ఇక బియ్యం ధరలను చూస్తే.... లలిత 26 కిలోలు ధర రూ.1590, క్లాత్ బ్యాగ్ రూ.1720, ఆవు దూడ రూ.1870, డైమండ్ రూ.1650, బెల్ రూ.1590, ఆర్‌విఎస్ ప్రీమియం రూ.1420 ధర పలుకుతున్నాయి.

కూరగాయల ధర వింటే దడ

నగరంలో బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా అన్ని వంటకాలలో నిత్యం వినియోగించే ఉల్లిపాయలు, టమోట ధరలు భారీగా పెరిగాయి. 20 రోజుల నాటి ధరతో పోలిస్తే కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగాయి. మార్కెట్‌లో ఉల్లిపాయలు కిలో రూ.50, టమోట రూ.75 ధర ఉంది. పచ్చిమిర్చి రూ.80, అల్లం రూ.280, బీన్స్ రూ.160, బీరకాయలు రూ.80, క్యాప్సికం రూ.60, కేరెట్ రూ.60, బంగాళాదుంప లు రూ.35, వెల్లుల్లి రూ.400 ధర ఉన్నాయి. వేసవికాలం ముగిసి వర్షాకాలం ప్రారంభం అవుతున్న రోజులలో కూరగాయల ధరలు ఇంత భారీగా పెరగడం ఎన్నడూ చూడలేదని, పేద, మధ్య తరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

నిలకడగా నూనెల ధరలు

పప్పులు ధరలు గణనీయంగా పెరిగినప్పటికీ, వంట నూనెల ధరలలో అంతగా పెరుగుదలలేదు. అయితే సన్ ఫ్లవర్ వంటి వాటి ధరలు కాస్త పెరిగాయి. వంటనూనెల ధరలు చూస్తే ఫ్రీడమ్ రూ.118, సఫోలో రూ.116, ఫార్చ్యూన్ రూ.111, క్రిస్టల్ రూ.118, రుచి గోల్డ్ పామాయిల్ రూ.96, సన్ డ్రాప్ రూ.177, సన్ ఫ్లవర్ రూ.180, ఎఎస్ బ్రాండ్ వేరుశనగ నూనె రూ.169గా ఉన్నాయి.

ఒకవైపు స్కూలు ఫీజుల భారం

స్కూల్స్ తెరుచుకున్నాయి. ఇద్దరు పిల్లలను ప్రైవేటు స్కూల్లో చదివిస్తున్నాం. స్కూల్ ఫీజులు భారీగా పెరిగాయి. అవి తప్పనిసరిగా చెల్లించాలి. సరిగ్గా ఇదే సమయంలో పప్పులు, కూరగాయల ధరలు అందనంత స్థాయికి పెరిగాయి. ప్రైవేట్ చిరు ఉద్యోగులు బ్రతకడం ఎలా...? ప్రభుత్వం చర్యలు తీసుకొని ధరలు తగ్గించాలి.

కర్రి లక్ష్మి, అల్లిపురం

డెంగీ, మలేరియాపై అప్రమత్తత

అందిస్తున్నామని, జ్వరలక్షణాలు, నీరసంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి, వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. డెంగీ, మలేరియాపై ప్రజలకు శాఖాపరంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ జీవన్‌రాణి డాక్టర్ సుమిత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తూర్పు, దక్షిణ ఎమ్మెల్యేలను కలిసిన ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నుంచి విజయం సాధించిన తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను సాంఘిక సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్యపద్మ వారి క్యాంపు కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు.



వెలగపూడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యపద్మ

కెజిహెచ్ ఘటనపై బాలల హక్కుల కమిషన్ సీరియస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో మంగళవారం గైనిక్ వార్డు నుంచి పిల్లల యూనిట్‌కు తరలించే క్రమంలో పసి బిడ్డకోసం తండ్రి పడిన అవస్థలపై మీడియాలో వచ్చిన వార్తలను సుమోటోగా స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదలచేశారు. కెజిహెచ్ గైనిక్ వార్డులో మంగళవారం కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన అల్లు శిరీష పసికందుకు జన్మనిచ్చిందని, నెలలు నిండకుండా పుట్టిన బిడ్డను పిల్లల వార్డులో ఉన్న ఐసియులోని అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు సూచించారని తెలిపారు. యుద్ధప్రాతిపదికన తరలించి భద్రతతో చికిత్స అందించాల్సి ఉన్నప్పటికీ సిబ్బంది ముందుకు రాక పోవడంతో పసికందును మహిళా సిబ్బంది చేతులతో తీసుకెళుతుండగా, ఆమె వెనుక బిడ్డ తండ్రి విష్ణుమూర్తి ఆక్సిజన్ సిలిండర్ భుజంపై మోసుకెళ్తూ వార్డుకు తరలిస్తున్న ఉదంతంపై ఆసుపత్రి ఉన్నతాధికారులు తక్షణ నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఆసుపత్రి వర్గాలు అందించే నివేదిక ఆధారంగా బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలకు తమ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్నట్టు తెలిపారు.

చిన్నారి ఆరోగ్యానికి రాచకొండ ఛారిటబుల్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న చిన్నారికి నగరానికి చెందిన రాచకొండ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రాచకొండ దశరథ రామయ్య దంపతులు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇటీవల పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్య దిశగా అడుగులు వేస్తున్న మత్యకార కుటుంబానికి చెందిన డి.భార్గవి అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైంది. పేదవారైన తల్లిదండ్రులు డి.అప్పారావు, కొండలు అప్పు చేసి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. కొన్ని రోజులుగా వెంటిలేటర్‌పై ఆమెకు చికిత్సను అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాచకొండ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రాచకొండ దశరథ రామయ్య దంపతులు, కుటుంబ సభ్యులు స్వయంగా వెళ్లి రూ.1.11 లక్షలను భార్గవి తల్లిదండ్రులకు అందజేశారు. ప్రస్తుతం బాలికకు వెంటిలేటర్ తొలగించి, సాధారణ చికిత్స అందిస్తున్నారని, మరికొద్ది రోజుల్లో కోలుకుంటుందని వైద్యులు చెప్పడంతో వీరు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ మధుసూదనరావు, స్టేట్ బ్యాంక్ పెన్షనర్స్ అధ్యక్షులు కోటేశ్వరరావు, ప్రగడ వాసు, కాలనీ పెద్దలు ఉమ్మడి అప్పారావు, దాసు, పోలి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న రాచకొండ కుటుంబీకులు

టిడిఆర్ హబ్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీలో అక్రమంగా పిహెచ్‌డి ప్రవేశాలకు డిపార్ట్‌మెంట్‌కు నిమిత్తం లేకుండా అక్రమంగా పరీక్షల నిర్వహణ, పేపర్ సెట్టింగ్ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన టిడిఆర్ హబ్‌ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి నాయకులు సురేష్ మీనన్ డిమాండ్ చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి ఆధ్వర్యాన రిజిస్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం నాటికి ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సురేష్ మీనన్ మాట్లాడుతూ, యూనివర్సిటీలో పరీక్షల నిర్వహణకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఉందని, దాని ఆధ్వర్యంలోనే పరీక్షలు జరగాలని అన్నారు. కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌లో పరీక్ష పత్రం సెట్టింగ్, నిర్వహణ జరాగాలని, ఈ నిబంధనలు పట్టించుకోకుండా టిడిఆర్ చైర్మన్ జేమ్స్ స్టీఫెన్ అక్రమాలకు నిలయంగా తీర్చిదిద్దారని ఆరోపించారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో అనేక కోర్సుల నిర్వహణ బాధ్యతలను స్టడీ సెంటర్ పేరిట ప్రయివేట్ కాలేజీలకు అప్పగించడం వల్ల, డిస్టెన్స్ మోడ్‌లో ఆదాయానికి గండిపడిందని తెలిపారు. డిస్టెన్స్ మోడ్‌లో అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఒలింపియాడ్‌లో విశాఖ విద్యార్థులకు టాప్ ర్యాంకులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : 2023-24 సంవత్సరానికి ఎసిఎఫ్ ఒలింపియాడ్ పరీక్షలో విశాఖపట్నానికి చెందిన ముగ్గురు విద్యార్థులు అంతర్జాతీయ టాప్ ర్యాంకులు సాధించారని ఎసిఎఫ్ ఒలింపియాడ్ వ్యవస్థాపక డైరెక్టర్ మహభీర్‌సింగ్ తెలిపారు. పోలాక్స్ స్కూల్లో 1వ తరగతి విద్యార్థి బి.సుహాస్ ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్‌లో మొదటి ర్యాంక్ సాధించి అంతర్జాతీయ గోల్డ్‌మెడల్, మెరిట్ సర్టిఫికెట్ సాధించారని పేర్కొన్నారు. రవిజీస్ లిటిల్ చాంప్స్ స్కూల్ 1వ తరగతి విద్యార్థి పి.హవ్య ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో మొదటి ర్యాంక్ సాధించి అంతర్జాతీయ బంగారుపతకం, మెరిట్ సర్టిఫికెట్ అందుకుందని వివరించారు. ది ప్రెసిడెన్సియల్ స్కూల్ 1వ తరగతి విద్యార్థి నడిపిల్లి ఖ్యాతిశ్రీ అంతర్జాతీయ గణిత ఒలింపి యాడ్‌లో రెండోర్యాంక్ సాధించి అంతర్జాతీయ రజత పతకం, మెరిట్ సర్టిఫికెట్‌ను సాధించినట్లు తెలిపారు. ఎస్-ఎఎస్ ఒలింపియాడ్‌లో విశాఖ నుంచి 45,166 మంది విద్యార్థులతో సహా 70 దేశాలలో సుమారు మిలియన్ల మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పోర్టు ఏరియాలోని శ్రీ శృంగమణి పర్వతంపై శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయి. బుధవారం సుప్రభాత సేవ, హెరీమాలు, 20న పండిత గోష్టి, మహాదాశీర్వచనం, 21వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు శ్రీ స్వామి వారి తెప్పోత్సవం, 22వ తేదీన పూర్ణాహుతి, సముద్రస్నానం, 23న శ్రీ పుష్పయాగం, రుత్వికసన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయి. 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

4వ జోన్‌లోని వాణిజ్య సముదాయాలకు 28న వేలం

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి 4వ జోన్ పరిధి డైక్స్ ట్యాంక్, జగదాంబ, పాత బస్టాండ్ ఫేజ్-2, పద్మనగర్, సూర్యాబాగ్‌లోని వాణిజ్య సముదాయాలు, అంబేద్కర్ కల్యాణ మండపం, ఎస్‌విపి (పూర్ణ మార్కెట్), రామకృష్ణా రైతు బజార్, రెల్లివీధి (రోడ్ సైడ్) ఫిష్ మార్కెట్ల ఆశీలు కోసం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు తెలిపారు. వాణిజ్య సముదాయంలోని దుఖాణాలకు, కల్యాణ మండపం, మూడు మార్కెట్లకు మూడేళ్ల కాలపరిమితికి గుత్తకిచ్చుటకు ఈ నెల 28న ఉదయం 11 గంటలకు సూర్యాబాగ్‌లోని జోనల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలంపాటలో పాల్గొనాలని సూచించారు మరిన్ని వివరాలకు సంబంధిత జోనల్ కార్యాలయం పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని సూచించారు.

పారా అథ్లెటిక్స్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం వేదికగా పోలీస్ బేరక్స్ గ్రౌండ్‌లో ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న 5వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల పోస్టర్‌ను జిల్లా దివ్యాంగుల అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి బుధవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు మాధవి తెలిపారు. ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి వికలాంగ క్రీడాకారులు పాల్గొని ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక అవ్వాలని ఆకాంక్షించారు. ఆసక్తిగల వికలాంగ క్రీడాకారులు 7013569514, 9390131777 నంబర్లను సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ కో-ఆర్డినేటర్ వై.శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో వి.రామస్వామి, బి.గణేశ్, ఎమ్.నరసింహరాజు, హుస్సేన్, ఆవల రమేష్ బాబు, ప్రసాద్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన జిందాల్ గ్రూప్ అధినేత

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో : జిందాల్ స్టీల్ గ్రూప్ అధినేత కనకారావు రాచూరి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అమరావతిలో కలశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి ముఖ్యమంత్రిని అభినందించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ, రాష్ట్రాభివద్ధిలో జిందాల్ స్టీల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కనకారావు

టిడ్కో ఇళ్లకు గ్రహణం వీడేనా..?



పద్మనాభపురంలో నిర్మాణం పూర్తయినా పంపిణీకి నోచుకోని టిడ్కో ఇళ్లు

- పంపిణీ కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- ఐదేళ్లుగా నిరాదరణకు గురైన ఇళ్లు
- ఎన్నికలకు ముందు హడావిడిగా ప్రారంభం
- సౌకర్యాలు లేక వినియోగానికి దూరం

ప్రజాశక్తి -పెందుర్తి : గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టిడ్కో ఇళ్లకు ఇప్పటికైనా గ్రహణం వీడి తమకు పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఐదేళ్ల క్రితమే దాదాపు ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ, నివాసానికి అవసరమైన సౌకర్యాల కల్పనలో జాప్యం జరగడంతో, అప్పట్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా పంపిణీ జరగలేదు. తర్వాత ప్రభుత్వాలు మారడం, వైసిపి అధికారంలోకి వచ్చాక వీటిని పూర్తిగా వదిలేశారు. మధ్యలో లబ్ధిదారుల జాబితాల మార్పు, ఒక ప్రాంతంలోని ఇళ్ల వేరే ప్రాంతంలో వారికి కేటాయించడం వంటి గందరగోళం సృష్టించిన జగన్ ప్రభుత్వం, సరిగ్గా ఎన్నికలకు కొన్ని రోజుల ముందు రంగులు వేసి, హడావిడిగా ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. అయితే లబ్ధిదారుల ఎంపికపై స్పష్టత లేకపోవడంలో, టిడ్కో గృహసముదాయాల్లో విద్యుత్, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు వంటి సౌకర్యాలు లేకపోయినా, ఐదేళ్లగా నిర్లక్ష్యంగా వదిలేయడంతో పాడైన ఇళ్లకు పైపైనే మరమ్మతులు, రంగులు వేసి ప్రారంభించారు. ఇంతలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో టిడ్కోలబ్ధిదారుల ఆశలు కాస్తా చిగురించాయి. జివిఎంసి 92వ వార్డు పరిధిలోని పద్మానాభపురం శివారు ప్రాంతంలో ఉన్న టిడ్కో ఇళ్ల పరిస్థితిపై పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు దృష్టి సారించి, అధికారులతో సమీక్షించారు. దీంతో టిడ్కో ఇళ్లకు పూర్వవైభవం వస్తుందని, పూర్తి సౌకర్యాలతో అతిత్వరలో తమకు అందుబాటులోకి వస్తాయని లబ్ధిదారులు ఎంతో ఆశగా, ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యం



టిడ్కో ఫీడర్ బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఇ మహేంద్రనాథ్

ప్రజాశక్తి- వేపగుంట : వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎపిఇపిడిసిఎల్, ఆపరేషన్స్ విభాగం సూపరింటెండెంట్ ఇంజినీరు ఎల్.మహేంద్రనాధ్ అన్నారు. బుధవారం చీమలాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని క్రొత్తగా ఏర్పాటుచేసిన 11కెవి ఎపి టిడ్కో ఫీడర్ బ్రేకర్‌ను ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించుటకు ఈ బ్రేకర్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్, ఆపరేషన్స్ విభాగం మూడవ జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు, డిఇఇలు సిరికి అప్పన్నబాబు, ఉదయకిరణ్, ఎఇఇలు రమణమూర్తి, అప్పలనాయుడు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న హెచ్ఎం, నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగోవార్డు మంగమారి పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులతోపాటు టిడిపి నాలుగో వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు, పార్టీ నాయకులు గరికిన ఎల్లయ్య, సూరాడ నరసింగరావు, మాజీ ఎంపిటిసి ఎల్లయ్య, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు

చెక్కు బౌన్స్ కేసులో నిందితునికి ఏడాది జైలు

- రూ.పది వేలు జరిమానా

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : చెక్కు నిరాదరణ కేసులో నిందితునికి ఏడాది జైలుశిక్ష, మరో రూ.10 వేల జరిమానా విధిస్తూ విశాఖపట్నం ఏడవ స్పెషల్ మెజిస్ట్రేట్ డి.విశ్వనాథం బుధవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షాన మరో 3 నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పులో పేర్కొన్నారు.. ఫిర్యాదిదారు తరపు న్యాయవాది కదిరి రాము అందించిన వివరాలివి,

విశాఖపట్నంలోని అక్కయ్యపాలేనికి చెందిన ఫిర్యాదిదారు కరుభుక్త పద్మ నుంచి గాజువాక అక్కిరెడ్డి పాలేనికి చెందిన నిందితుడు ఆడారి శాంతారాం, అతని భార్య ఆడారి లక్ష్మీకాంతం ఇరువురూ ఇంటి ఖర్చులు, చిల్లర రుణాల తీర్మానం, ఇతర అవసరాల కోసం 2021 ఫిబ్రవరి 14న, రూ.12 లక్షల అప్పు తీసుకొని దానికి ప్రామిసరీ నోటు రాయించి ఇచ్చారు. ఫిర్యాదిదారు ఎన్ని పర్యాయాలు అప్పు తీర్చమని అడిగినా, స్పందించని రుణగ్రహీతలు, ఎట్టకేలకు నిందితుడు ఆడారి శాంతారాం భార్యాభర్తలు ఇద్దరి తరపున 2023 జనవరి 23న రూ.10 లక్షలకు ఫిర్యాదీదారుకు చెక్కు ఇచ్చాడు. దాన్ని బ్యాంకులో వేయగా, సరిపడా నిధులు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. దీనిపై చెక్ ఇచ్చిన శాంతారాం, అతని భార్య లక్ష్మీకాంతం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు లీగల్ నోటీసు జారీ చేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ఫిర్యాదిదారు కోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ జరిపి, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం నిర్ధారణ కావడంతో నిందితునికి జైలు,జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

30న ఇంగ్లీష్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈనెల 30న ఉదయం పది గంటలకు ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో రంగసాయి మీడియా ఆధ్వర్యంలో స్పష్టమైన (ఆక్యురేట్) ఇంగ్లీష్‌పై శిక్షణాపరమైన అవగాహన తరగతి నిర్వహిస్తున్నామనిరంగసాయి మీడియా ప్రతినిధి బాదంగీర్ సాయి తెలిపారు.నిఘంటుకర్త, లెక్సికోగ్రాఫర్ సనపల జీవన్‌కుమార్ పాల్గొని, ఉద్యోగ ఇంటర్వ్యూలు, ఇతరత్రా సందర్భాల్లో ఇంగ్లీష్‌పై అవగాహన కల్పిస్తారన్నారు.

ఈ వర్క్‌షాప్‌లో అరుదైన ఇంగ్లీష్ గ్రామర్, వకాబులరీ, విదేశీ పుస్తకాలను పిడిఎఫ్ రూపంలో అభ్యర్థుల మొబైల్స్‌కు అందజేస్తామన్నారు. ప్రసిద్ధ వియస్‌డి. ఇంగ్లీష్ టు తెలుగు డిక్షనరీని స్పెషల్ డిస్కౌంట్‌పై ఇస్తామన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఆసక్తిఉన్నవారు 8247829025 సెల్ నెంబర్‌కు సంప్రదించి పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చని సూచించారు. నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సాయి సూచించారు.

ఘనంగా దుర్గాలమ్మ పండుగ

ప్రజాశక్తి -పద్మనాభం: మండలకేంద్రం పద్మనాభంలో దుర్గాలమ్మ పండగ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం తోలేళ్ల ఉత్సవంతో ప్రారంభమైన వేడుకలో భాగంగా అమ్మవారి జోగిని చదురు గుడి నుంచి డోలు, డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారి ఘటాల ఊరేగింపు జరిగింది. దుర్గాలమ్మ పండుగ సందర్భంగా పద్మనాభం సిఐ సిహెచ్ శ్రీధర్ గ్రామాన్ని సందర్శించి ఉత్సవాన్ని పరిశీలించారు.

ఉత్సవ వివరాలను కమిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకుని, అనుపోత్సవానికి తగిన బందోబస్తు కల్పిస్తామని, శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఉత్సవ కమిటీకి, గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు టి. పద్దు, ఎ,రమణ, టి.పైడినాయుడు బి.రాము, బి.శ్రీను పాల్గొన్నారు.

జమ్మి చెరువు పార్కులో మొక్కలు నాటివేత

ప్రజాశక్తి-భీమునిపట్నం : స్థానిక జమ్మి చెరువు పార్కులో జెసిపి వాకర్స్ క్లబ్ సభ్యులు మీసాల బుచ్చిబాబు, కదిరి జగన్నాథం బుధవారం మొక్కలు నాటారు. ఔషధ గుణాలున్న ఉసిరి, జమ్మి, కథంభం, మారేడు తదితర మొక్కలను నాటారు.

మూగ యువతి ఆత్మహత్యాయత్నం

- కాపాడి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి - ఆరిలోవ : సాగర తీరం తెన్నేటి పార్కు సమీపంలో ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మూగ అమ్మాయిని పెట్రోలింగ్ పోలీసులు రక్షించి, ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. యువతి వివరాలు తెలుసుకొని అనకాపల్లిలో ఉన్న ఆమె తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు.

అనకాపల్లి ప్రాంతానికి చెందిన దేవి అనే మూగ అమ్మాయి విశాఖ నగరంలోని వాల్తేరులోని డఫ్ అండ్ డంబ్ స్కూల్లో చదువుతూ మరో మూగ అబ్బాయితో ప్రేమలో పడింది. ఇద్దరు కులాలు వేరు కావడంతో అబ్బాయి కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించారు. దీంతో ఆవేదనకు గురై, ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని భావిస్తున్నారు. యువతికి కాపాడి వారి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు చొరవను పలువురు అభినందిస్తున్నారు.

గంజాయి, డ్రగ్స్‌పై పోలీసుల స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- పెందుర్తి : రాష్ట్ర హోంశాఖ మంత్రిగా అనిత ఆదేశాల మేరకు సిపి రవిశంకర్ సూచనలతో గంజాయి, మద్యం, డ్రగ్స్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. నగరంలో పోలీసులు, అధికారులతో సమీక్షలో దీనిపై స్పష్టమైన ఆదేశాలిచ్చిన నేపథ్యంలో బుధవారం జివిఎంసి 95వ వార్డు వరలక్ష్మి నగర్, సంతోష్‌నగర్ ప్రాంతంలో ఎస్ఐ తాతారావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి, డ్రగ్స్‌పై విస్తృత తనిఖీలు చేశారు. ఆయా ప్రాంతాల శివారులో సోదాలు నిర్వహించి, యువతను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రగ్స్, గంజాయి కలిగి ఉన్నా, తాగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటిపై నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే గంటాకు అభినందన



ఎమ్మెల్యే గంటాను అభినందిస్తున్న ఎంపిడిఒ జానకి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎంవిపి కాలనీలోని తన నివాసంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును భీమిలి ఎంపిడిఒ డాక్టర్ వి జానకి, పంచాయతీ విస్తరణాధికారి గుండు అప్పలరాజు,ఎంఇఒ ఎం.శివరాణి, పలువురు పంచాయతీ కార్యదర్శులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో జరగనున్న మండల పరిషత్ సాధారణ సమావేశానికి రావాలని ఆహ్వానించారు.

ఎమ్మెల్యే పల్లాకు శుభాకాంక్షలు



పల్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి -గాజువాక :గాజువాక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో గాజువాక ఆటోనగర్ చెందిన ఎపి టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ సమస్యలను ఎమ్మెల్యే పల్లాకు విన్నవించగా, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పల్లాను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు కరణం కనకారావు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి బోండా అచ్చిబాబు, ఉపాధ్యక్షులు సిహెచ్ పాపారావు, జాయింట్ సెక్రెటరీ సిహెచ్ ప్రసాద్, కోశాధికారి ఎన్ రమణ ఉన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు బుల్లెట్ ప్రూఫ్ కారు

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతోపాటు తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం బుల్లెట్ ప్రూఫ్ కారును కేటాయించింది. బుధవారం తనకు కేటాయించిన కారులో ఎమ్మెల్యే పల్లా స్థానిక కుంచుమాంబ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాక ఇప్పటివరకు ఒక్కరే గన్‌మ్యాన్ భద్రత ఉన్న పల్లాకు ఇద్దరు గన్‌మెన్‌లతోపాటు ఎస్ఐ ర్యాంక్ అధికారిని సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించారు.

ఎమ్మెల్యే వెలగపూడికి సత్కారం



రామకృష్ణబాబును అభినందిస్తున్న వాకర్స్

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం తూర్పు ఎమ్మెల్యేగా వరుసగా నాలుగోసారి ఎన్నికైన వెలగపూడి రామకృష్ణబాబును కలిసి అభినందనలు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సాయికుమార్, కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షులు ఎం.వి.రమణ, కోశాధికారి సత్యనారాయణ, రాజు, శ్రీనివాసరావు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ భవనం పూర్తయ్యేదెన్నడో..!



అసంపూర్తిగా ఉన్న ఆరిలోవ పోలీస్‌స్టేషన్ భవనం

- నిధులున్నా ఆరేళ్లుగా నిలిచిన నిర్మాణం
- రెండు దశాబ్దాలుగా ఒకే గదిలో విధులు
- అవస్థలు పడుతున్న పోలీసులు, ప్రజలు
- ప్రభుత్వం మారడంతో పూర్తవుతుందని ఆశ

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోనే నేరాలరేటు ఎక్కువగా ఉన్న ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు సరైన వసతి లేక నానా అవస్థలు పడుతూ ఇక్కడి అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అటు రుషికొండ నుంచి, ఇటు బిఆర్‌టిఎస్ రహదారి దారపాలెం వరకు ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధి విస్తరించి ఉండగా, ఇక్కడిపోలీసులు మాత్రం రెండు దశాబ్దాలుగా ఒకే గదిలో అధికారులు, సిబ్బంది ఇరుకుఇరుకుగా కూర్చుంటూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో ఒక సిఐ, ముగ్గురు ఎస్ఐలు, కంప్యూటర్ విభాగం, రైటర్, ఏఎస్ఐలు విధులు నిర్వర్తిస్తుంటారు.

రెండు దశాబ్దాలుగా అగ్గిపెట్టె లాంటి ఒకే గదిలో విధులు నిర్వర్తించడంతో అధికారులు, సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారు అధిక సంఖ్యలో ఉండడంతో రోడ్డ మీదే వారంతా పడిగాపులు పడక తప్పడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆరిలోవ పోలీస్‌స్టేషన్ స్థాయి, దీని పరిధిని దృష్టిలో పెట్టుకుని, శాంతి భద్రతలు, నేర విభాగం, ట్రాఫిక్ ఇలా వేర్వేరు విభాగాలన్నీ ఒకే చోట ఉండేవిధంగా బహుళ అంతస్తులు నిర్మాణానికి ఆరేళ్ళ క్రితం టిడిపి ప్రభుత్వం రూ 6 కోట్లు నిధులు మంజూరుచేసింది. హనుమంతువాక వద్ద బిఆర్‌టిఎస్‌ను ఆనుకొని ఉన్న విమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో స్థలం కేటాయించారు. పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులకు అప్పటి హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేయగా, అంతే శరవేగంగా నిర్మాణపనులు సాగి, భవనం ఒక రూపులోకి వచ్చింది. ఇంతలో ప్రభుత్వం మారడంతో నిధులు మంజూరు చేయకపోవడమో, మరే ఇతర కారణాలో తెలియవు కాని నిర్మాణ పనులు మందగించాయి. నగరానికి వచ్చిన పోలీస్ కమీషనర్లు అందరూ ఆరిలోవ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుత నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యర్ కూడా కొన్ని నెలల క్రితం ఈ నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాన్ని పరిశీలించి, నిధులకు ఆటంకం లేకుండా కొంతభాగమైన పూర్తి చేసి అప్పగించాలని గుత్తేదారుని కోరినట్టు సమాచారం. దీనితో కొన్ని రోజులుగా మళ్లీ నిర్మాణ పనులు మొదలయ్యాయి. తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మరో వైపు విశాఖ జిల్లాకు చెందిన వంగలపూడి అనిత హోంమంత్రి కావడంతో పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి అవుతుందని స్థానికులు, పోలీసు సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆరిలోవ పోలీస్‌స్టేషన్ నూతన భవనం పూర్తయి, ఇక్కడి పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు ప్రజల వసతికష్టాలకు విముక్తి లభిస్తుందని ఆశిస్తున్నారు.

ఆహ్లాదకరంగా పార్కుల అభివృద్ధి

- జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ




ముడసర్లోవ పార్కులో సుందరీకరణ పనులపై సూచనలు చేస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి - ఆరిలోవ / మధురవాడ : ప్రజల ఆహ్లాదానికి పలు పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందించనున్నట్లు జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ అన్నారు. బుధవారం రెండవజోన్ పరిధిలోని ముడసర్లోవ చిల్డ్రన్ పార్క్, ఐటీ సెజ్ సమీపంలోని తారకరామానగర్ లేఅవుట్ వద్ద ఐటి పార్కు, టెన్నిస్ కోర్టు పార్కుల పనులను జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముడసర్లోవ పాత నర్సరీ ప్రదేశంలో నిర్మిస్తున్న చిల్డ్రన్ పార్క్ పనులను పరిశీలించిన జివిఎంసి కమిషనర్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ముడసర్లోవ చిల్డ్రన్ పార్కులో వాకింగ్ ట్రాక్‌కు అడ్డంగా ఉన్న చెట్లకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా వేరే చోటుకు మార్పు చేయాలని సూచించారు. పిల్లల ఉల్లాసానికి, ఆనందాలకు అనుగుణంగా పార్కు ఆహ్లాదకరంగా ఉండేలా పర్యావరణహిత వస్తువులతో తీర్చిదిద్దాలన్నారు. పిల్లల ఆటలకు, కార్యకలాపాలకు ఆట పరికరాలను, మరుగుదొడ్లును ఏర్పాటుచేసి, పార్కును అందంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ముడసర్లోవ డంపింగ్ యార్డ్ వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

అనంతరం ఐటి సెజ్ సమీపంలో తారకరామా నగర్ లేఅవుట్ వద్ద ఐటి పార్కును, టెన్నిస్ కోర్టు పార్కులను పరిశీలించి పనులు వేగవంతం చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని జివిఎంసి ఎస్ఇ శాంసన్ రాజును ఆదేశించారు. పర్యటనలో జివిఎంసి రెండో జోన్ కమిషనర్ శైలజ వల్లి, ఎఎంహెచ్ఒ డాక్టర్ కిషోర్, ఇఇ శాంతిరాజు, డిఇఇ వంశీ, ఎఇఇ శ్రీధర్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంపిడిఒ అప్పలనాయుడు

ప్రజాశక్తి-ఆనందపురం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిపై ఉందని ఎంపిడిఒ అప్పలనాయుడు అన్నారు. బుధవారం నేలతేరు కస్తూర్భా విద్యాలయంలో నిర్వహించిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో మాట్లాడుతూ 6 నుండి 14 సంవత్సరాల లోపు బాలబాలికలందరూ విధిగా పాఠశాలలో ఉండి చదువుకోవాలన్నారు. అంగన్వాడీ టీచర్లు, వాలంటీర్లు, అందరూ భాగస్వామ్యంగా వచ్చేనెల 12లోగా బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎంఇఒ గంగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో పేదరికంతో చదువుకు దూరం అవుతున్న బాలబాలికలను గుర్తించి,వారిని ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాసరావు, అంగన్వాడి టీచర్లు, సిఆర్‌పిలు, పిఇటిలు పాల్గొన్నారు.

26న షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగుల

ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -మాధవధార : షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనం ఈనెల 26న మాధవధార, మాధవస్వామి కళ్యాణ మండపంలోజరుగుతుందని షిప్‌యార్డు రిటైర్డుఉ ద్యోగులు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో బూసి ప్రసాద్ అధ్యక్షతన అసోసియేషన్ నెలవారీ సమావేశంలో గౌరవాధ్యక్షుడు బి సూర్యనారాయణ, అధ్యక్షుడు బూసి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె సుధాకర్ మాట్లాడుతూ ఈనెల 26న జరిగే షిప్‌యార్డ్ రిటైరీస్ 2వ ఆత్మీయ సమ్మేళనంలో షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. 80ఏళ్ళు నిండిన వృద్ధులను సత్కరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై ఆరా



వార్డు పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి - ములగాడ : పశ్చిమ నియోజకవర్గం, 60వ వార్డులో ఎమ్మెల్యే పి.గణబాబు అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. ముందుగా గొల్లలపాలెం మైదానాన్ని పరిశీలించారు. ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించి, మైదానంలో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పనపై అడిగి తెలుసుకున్నారు. . మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, వార్డులో సమస్యలు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అధికారులతో కలిసి పర్యటిస్తున్నారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- మునగపాక

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు ఐదు వారాలుగా పెండింగ్లో ఉన్న కూలి డబ్బులు తక్షణమే చెల్లించి ఆదుకోవాలని ఏపీ ఉపాధి హామీ కార్మికుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్ బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. స్థానిక పురిటిగడ్డ ప్రాంత ఉపాధి కూలీలు బిల్లులు చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ బ్రహ్మాజీ నేతృత్వంలో బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ చట్ట ప్రకారం 15 రోజుల్లోగా బిల్లులు చెల్లించాల్సి ఉండగా, ఐదు వారాలుగా కూలీలకు డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఏ వారానికి ఆ వారం కూలీలకు పేసులు ఇవ్వాల్సి ఉండగా దానిని అమలు చేయలేదన్నారు. పని ప్రదేశంలో విష కీటకాల బారిన పడి ప్రాణాపాయం సంభవిస్తే ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో వాడుతున్న పనిముట్లకు అద్దె చెల్లించడం లేదని వాపోయారు. ఎండలు విపరీతంగా మండుతున్న వేళ పని ప్రదేశంలో టెంట్లు వేయలేదని, మంచినీరు, మజ్జిగ సౌకర్యం కల్పించలేదని పేర్కొన్నారు. కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి రూ.300 చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినా దానిని అమలు చేయడం లేదన్నారు. ఉపాధి కూలీలకు ఐదు వారాలుగా పెండింగ్లో ఉన్న బిల్లులు చెల్లించాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపిడిఒ మన్మధరావుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి హామీ కూలీలు



ధ్వంసం చేసిన శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్ తదితరులు

అభివృద్ధి పనుల శిలాఫలకం ధ్వంసం

నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్ తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల మేజర్ గ్రామపంచాయతీ పరిధి తుమ్మపాల వీధి వేణుగోపాలస్వామి గుడి నుంచి నడిపల్లి వారి దొడ్డి వరకు రూ.11 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రైన్కు సంబంధించి నాటి మంత్రి గుడివాడ అమర్నాథ్ 2024 ఫిబ్రవరి 22న ప్రారంభించిన శిలాఫలకాన్ని మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ చర్యలను గ్రామ సర్పంచ్ పెంటయ్య నాయుడు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం శిథిలమైన శిలాఫలకం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు. గ్రామంలో ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పీలా బుజ్జి, కంకణాల రాజు, రవ్వ శ్రీను, గొంతిన బుజ్జి, ఎంపీటీసీ సభ్యురాలు పన్నీరు వెంకటలక్ష్మి, వార్డు మెంబర్ జెర్రిపోతుల లక్ష్మి, జెర్రిపోతుల రాము, పెంటకోట రాజు తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలి రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులు

రైల్వే స్టేషన్లో జోరుగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి రైల్వే స్టేషన్లో ఆధునిక హంగులు సమకూర్చుకుంటూ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తుని రైల్వే కమర్షియల్ ఆఫీసర్ నవీన్ తెలిపారు. స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి కమర్షియల్ ఆఫీసర్ నవీన్ను ప్రజాశక్తి ఫోన్లో సంప్రదించింది. ఆయన అందించిన వివరాలు ప్రకారం... ఈ ఏడాది ఫిబ్రవరిలో సుమారు రూ.460.98 కోట్లతో విజయవాడ డివిజన్లోని 10 రైల్వేస్టేషన్లు ఆధునీకీకరించడానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులకు ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలో యలమంచిలి కూడా ఉంది. ఎంపిక చేసిన ఈ పది రైల్వే స్టేషన్లలో వైఫై, ఎస్కలేటర్లు, లిఫ్టులు, వెయిటింగ్హాళ్లు, ఎకోటాయిలెట్స్, వాటర్ కియోస్క్, స్టేషనంతా వెలుగులు విరజిమ్మే విద్యుత్ కాంతులు, స్టాళ్లు సమకూర్చబడతాయి. ఈ పనులన్నీ యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని నవీన్ తెలిపారు.

పంటల వారిగా సాగు వివరాలు నమోదు చేయాలి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న గణాంకశాఖ ఉప సంచాలకులు సౌజన్య

ప్రజాశక్తి-అనకాపల్లి

2వ దశ వ్యవసాయ గణనను 2021-22 సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకొని కమతాల వారీగా, పంటల వారీగా సాగు వివరాలు నమోదు చేయాలని అర్థ గణాంక శాఖ ఉపసంచాలకులు కె.సౌజన్య తెలిపారు. జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రెండవ దశ వ్యవసాయ గణన జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ గణనలో మండల స్థాయిలో సహాయ గణాంకాధికారులు, గ్రామ స్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారి ప్రాథమిక కార్యకర్తగా, మండల సహాయ గణాంకాధికారులు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పర్యవేక్షకులుగా వుంటారని తెలిపారు. ముందుగా వ్యవసాయ గణనను నిర్వహించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్య ప్రణాళికాధికారి జి. రామారావు మాట్లాడుతూ వ్యవసాయ గణనకు సంబంధించి ఇన్ పుట్ సర్వేలో రైతుల విద్యార్హతలు, రైతులు వినియోగించిన పని ముట్లు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రైతు బీమా, రైతు వ్యవసాయ రుణ వివరాలు మొదలగు అంశాలను ప్రతి మండలంలో ఎంపిక చేయబడిన గ్రామంలో కచ్చితత్వంతో కూడిన వివరాలను ప్రభుత్వ మొబైల్ యాప్ ద్వారా సేకరించాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గణాంకాధికారి ఎన్.శ్రీరామ్మూర్తి, ఉప గణాంకాధికారులు, జిల్లాలోని సహాయ గణాంకాధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని పి.బోనంగి గ్రామ పంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు నిధులు కేటాయించాలని ఆ పంచాయతీ సర్పంచ్ బందారు కల్యాన రాజశేఖర్ బుధవారం ఎంపీడీవో కీర్తి స్పందనకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఉపాధి హామీ పనులను గ్రామంలో సుమారు 100 మంది కూలీలు చేస్తున్నారని, ఈ ఏడాది పని లేక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి ఆరు సంవత్సరాల నుండి ఫీల్డ్ అసిస్టెంట్ లేరని, దీనిపై గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే, నాయకులు చుట్టూ పలుమార్లు తిరిగి విన్నవించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వమైనా గ్రామానికి తగు న్యాయం చేయాలని, గ్రామంలో ఉపాధి హామీ పనులకు బడ్జెట్ కేటాయించి పనులు కల్పించాలని కోరారు.

పెద్ద గెడ్డ ఆక్రమణపై నిరసన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం గ్రామ రెవిన్యూ పరిధి, వెంకటరాయుడు చెరువు ఆయకట్టు పరిధిలో ఉన్న పెద్ద గెడ్డ ఆక్రమణపై రైతులు బుధవారం నిరసన తెలిపారు. సుమారు వంద ఎకరాల భూమిని వెంకటరాయుడు చెరువు నీరే ఆధారంతో రైతులు సాగు చేసుకుని జీవిస్తున్నారు. ఈ చెరువులోకి పెద్దగెడ్డ ద్వారానే నీరు వచ్చి చేరుతుంది. గ్రామానికి చెందిన స్థానిక సర్పంచ్ తన సొంత భూమికి గ్రావెల్ రోడ్డు వేసేందుకు గెడ్డ కాలువను ఆక్రమించి జెసిబిల సహాయంతో మట్టితో కప్పివేశారు. దీంతో వెంకటరాయుడు చెరువులోకి నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. స్థానిక సర్పంచ్ చర్యల వల్ల వందలాది మంది రైతులు నష్టపోతున్నారని, తక్షణమే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలన చేసి ఆక్రమణ దారుడుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం దీనిపై రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి అక్రమ రోడ్డును తొలగించి రైతుల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.ఆదినారాయణ, కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు



రిక్షా కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి -విలేకర్ల యంత్రాంగం

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

అనకాపల్లి : రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బుధవారం అనకాపల్లి ఉడ్పేట వద్ద రిక్షా కార్మికులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో పదేళ్ల బీజేపీ నిరంకుశ పరిపాలనను ఎదురిస్తున్న ఒకే ఒక్క నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిన భానుమూర్తి యాదవ్, తుట్టా రమణ, కత్తెర శ్రీధర్, సేనాపతి ఈశ్వరరావు(రాజు), కొట్ని మాణిక్యం, వేగి సూరిబాబు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ 54వ జన్మదినం సందర్భంగా ఏపిసిసి అధికార ప్రతినిధి ఐఆర్.గంగాధర్ బుధవారం అనకాపల్లిలో కేకును కట్ చేసి సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ గల్లీ నుండి ఢిల్లీ వరకు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి కార్యకర్తలలో నూతన ఉత్సాహాన్ని పెంపొందించారని తెలిపారు. దేశం కోసం, దేశ భవిష్యత్తు కోసం రాహుల్ చేస్తున్న పోరాటంలో సైనికులు వలె పని చేస్తామని సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిల్లా కోటేశ్వరరావు, దాసరి సంతోష్, దాడి పరమేశ్వరరావు, కొల్లి సత్యారావు, కర్రి దుర్గాప్రసాద్, అల్లుమల్ల భాస్కర్, ఇందుర్తి గౌరీ, ఏడువకుల దేవుడమ్మ, పూజారి నర్సయ్య పాల్గొన్నారు.

చీడికాడ : కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పలువురికి పంచారు. అనంతరం శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ



చీడికాడలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జగత శ్రీనివాస్ తదితరులు

భారతదేశానికి కాబోయే ప్రధానమంత్రి అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు

చీరలు పంపిణీ

చోడవరం : రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా చోడవరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగత శ్రీనివాస్ ఆధ్వర్యంలో మారుతి నగర్, ఆంజనేయస్వామి దేవాలయం వద్ద బుధవారం కేకు కట్ చేశారు. 100మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగతా మాట్లాడుతూ రాహుల్ గాంధీ 4080 కిలోమీటర్ల భారత జోడో యాత్ర చేశారన్నారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి దేశంలో అధికార పగ్గాలు చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూకరాజు, అప్పారావు, తవ్వా వీర్రాజు, నాని, సత్యవతి, వీరి లక్ష్మి, సుజాత, వెలుగుల అర్జున్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వజ్జిపర్తి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

వైసిపి నాయకుల ఒత్తిడితోనే రాజీనామాలు

తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి -మునగపాక : వైసీపీ నాయకులు బలవంతంగా ఒత్తిడి చేయడంతోనే తాము రాజీనామాలు చేశామని మండలంలోని ఉమ్మలాడ గ్రామానికి చెందిన గ్రామ వాలంటీర్లు వాపోయారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం వారు ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓ మన్మధరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి తిరిగి అధికారంలోకి వస్తుందని, మిమ్మల్ని యధావిధిగా కొనసాగించడం జరుగుతుందని, కనుక తమ మాటలు విని రాజీనామాలు చేయాలని వైసిపి నాయకులు ఒత్తిడి చేయడంతో మరో మార్గం లేక రాజీనామాలు చేశామని తెలిపారు. తమకు న్యాయం చేసి యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ, బిఎస్‌పి నాయకులు లంబ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు వారధిగా నిలబడి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్లు తమదైన శైలిలో పాత్ర పోషించారని తెలిపారు. వారిని నూతన ప్రభుత్వం విధుల్లోకి తీసుకోకపోతే రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి రాజీనామాలు చేసిన వాలంటీర్లను యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని కోరారు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వాలంటీర్లు

విద్యార్థినులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో ప్రఖ్యాతి గాంచిన నాంది ఫౌండేషన్ వారి ప్రాజెక్ట్ నన్హి కాళీ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం కింద ఆడపిల్లలు ఫుట్ బాల్ క్రీడకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా వారికి ప్రోత్సాహం అందిస్తారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలకు స్ఫూర్తిని నింపే ఇటువంటి కార్యక్రమం తమ కళాశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రోగ్రాం నేషనల్ హెడ్ లిసా (కెనడా) మాట్లాడుతూ డైట్ కళాశాల ప్రోత్సాహంతో రానున్న రోజులలో అనకాపల్లి జిల్లా నుండి జాతీయ స్థాయి ఫుట్ బాల్ జట్టుకు ఎక్కువ మంది ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.దుర్గ శ్యాం ప్రసాద్, డీన్ డాక్టర్ ఈశ్వరరావు, అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు హేమంత్ కుమార్, భాను, దివ్య, ప్రతిమ, నేషనల్ ఫుట్ బాల్ క్రీడాకారిణి దేవు, సునీత, అనకాపల్లి జిల్లా ఫుట్ బాల్ క్రీడాకారులు, ఉత్తరప్రదేశ్, గుజరాత్ ఫుట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద బుధవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచారకులు ఎం.రాము మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు అందుబాటులో ఉంటాయని, స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వప్న, వైస్ ఎంపీపీలు నమ్మి మీనా గణేష్, పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు కాయల మురళి, నాయకులు ఉగ్గిన రమణమూర్తి, గొంతిని శ్రీనివాసరావు, పొన్నగంటి అప్పారావు, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, నిమ్మదల సన్యాసినాయుడు, కలగా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కె సామాలనాయుడు ఆధ్వర్యంలో వరి విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పెంటకోట అప్పలనాయుడు, టిడిపి నాయకులు కాటిపాం అర్జున్‌రావు, ఎం.రామ్ చరణ్, ఎం సంతోష్, ముత్యాల నాయుడు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న పప్పల

ప్రజాశక్తి - యలమంచిలి

చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ తిరుమల వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్న మాజీ ఎంపీ, టిటిడి మాజీ చైర్మన్ పప్పల చలపతిరావు మొక్కులు తీర్చుకున్నారు. తను అనుకున్న విధంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడంతో చలపతిరావు తన సహచరులతో వేంకటేశ్వరస్వామికి బుధవారం తలనీలాలు సమర్పించి మొక్కు చెల్లించారు. చలపతిరావుతో పాటు ఆయన అనుచరులు టిడిపి జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎస్.నాగేశ్వరరావు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్ మొక్కులు చెల్లించుకున్నారు.

జనసేన శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి -కశింకోట : జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుధవారం ఉప ముఖ్యమంత్రిగి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కశింకోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో జనసేన మండల అధ్యక్షులు బుదిరెడ్డి చిన్నా ఆ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు బుదిరెడ్డి మోహన్, వేగి కోటి, దాడి నాగరాజు, చిన్ని జనార్ధన్, సిదిరెడ్డి శ్రీను, తకాశి కృష్ణ, పెంటకోట రాము, పి.సంతోష్, ఎం.మోహన్, రాజారావు, రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జనసేన పార్టీ కార్యకర్తలు

బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



ఎ.కోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- కె.కోటపాడు : బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఇఒ కె.సత్యనారాయణ అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, తల్లిదండ్రులు ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని, డ్రాప్ అవుట్స్ ఉండరాదని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ఎంఇఒ సత్యనారాయణ మాట్లాడుతూ ఎక్కడైైనా డ్రాప్ అవుట్స్ ఉంటే గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎ.కోడూరు జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం బి.ప్రసాద్, ఎంఈఓ-2 డివిడి ప్రసాద్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దేవరాపల్లి : వికలాంగ పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ పడాల్‌దాస్, తహశీల్దారు జి.లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులు, హెచ్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిఆర్‌పిలతో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై సమీక్ష కార్యక్రమం ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడిఈడు పిల్లలు చదువు మధ్యలో ఆపేస్తే వారిని బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఉషారాణి పాల్గొన్నారు.

అనకాపల్లి : 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలు బడిలోనే ఉండేలా తల్లిదండ్రులకు విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ మురళీమోహన్ కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కె.చిట్టిబాబు, ఎస్.కోటేశ్వరరావు, ఏసి డిపిఓ శశికళ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, స్కూల్ కాంప్లెక్స్, ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆర్లి గ్రామ సచివాలయ సిబ్బంది మూకుమ్మడిగా గైర్హాజరు కావడంతో అందరి ఉద్యోగులకు ఎంపిడిఒ పట్నాయక్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వాటికి 24 గంటల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశించారు. అనకాపల్లి జిల్లాలోని మెజారిటీ గ్రామ సచివాలయ సిబ్బంది హాజరును సచివాలయ యాప్‌లో నమోదు చేయడం లేదు. ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది పనితీరును, హాజరు పట్టిని, రికార్డులను పరిశీలించడానికి బుధవారం ఉదయం 11 గంటలకు అనకాపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అప్పటికి సచివాలయ కార్యదర్శితో పాటు ఏ ఒక్క సిబ్బంది కార్యాలయానికి చేరుకోలేదు. సచివాలయంలో ఉన్న రికార్డులు పరిశీలించగా హాజరు పుస్తకంలో నెలరోజుల నుండి సంతకాలు లేవని, హాజరు పుస్తకాన్ని అప్‌డేట్ చేయలేదని, హాజరును యాప్‌లో నమోదు చేయలేదని గుర్తించారు. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఈ విషయాలపై 24 గంటల్లోగా సమాధానం చెప్పాలని, లేనట్లయితే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ఇరువాడ పంచాయతీలోని పేదలకు బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కృపా సహకార కేంద్రంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయ్ కుమార్ సౌజన్యంతో ప్రతినెలా నిర్వహిస్తున్న హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా ఈ నెల కూడా 30 మంది నిరుపేదలకు, వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు నిత్యావసర సరుకులు, ప్రయాణ ఖర్చులు, అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామల దెబోర, సుకుమార్ మాట్లాడుతూ కొన్నేళ్ళుగా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయకుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ ఇస్సాకు, బ్రదర్ ఎస్.నాయుడు, మాథ్యూ, స్మైలీ, దివ్య తేజ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లాకు రత్నాకర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : గాజువాక శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన పల్లా శ్రీనివాస్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దాడి రత్నాకర్ బుధవారం గాజువాక పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులుగా గెలుపొందిన పిజివిఆర్.నాయుడు (గణబాబు)ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అయ్యన్నను కలిసిన మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి : నర్సీపట్నం శాసనసభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడుని ఆయన నివాసంలో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దుస్సాలువ వేసి సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు సందిన సునీల్ కుమార్ పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న రత్నాకర్

విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ, దిబ్బపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, ముత్యాలమ్మపాలెం గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ఉచిత నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తారని, తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది కె.దిలీప్ కుమార్, స్కూల్ హెచ్ఎం బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న సుజాత ముత్యాలు

సుగర్స్‌లో చోరీలపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కొన్నేళ్లుగా మూతపడిన తుమపాల సుగర్ ఫ్యాక్టరీలో విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయని, వాటిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యతలపై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), షేర్ హోల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొర్లి మోది నాయుడు, ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పీలా విశ్వేశ్వరరావు, సీతారాం, తాతు నాయుడు తదితరులు ఫ్యాక్టరీ ఎండి శాస్త్రిని కలిసి వినత పత్రం అందజేశారు. డైలీ వేజ్ వర్కర్స్ గ్రాట్యూటీ చెల్లించాల్సి ఉందన్నారు. ఫ్యాక్టరీలో వాచ్మెన్లను పెట్టినా ఏ విధంగా సామాన్లు అపహరణకు గురవుతున్నాయన్న దానిపై తక్షణమే విచారణ చేపట్టాలని సూచించారు. దీనిపై ఎండి శాస్త్రి మాట్లాడుతూ దీనిపై జాయింట్ కలెక్టర్‌ను సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం నాయకులు, డైలీ వేజ్ వర్కర్స్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన



కొత్తకోటలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట పిహెచ్‌సి ఆధ్వర్యంలో హెల్త్ వెల్ నెస్ కేంద్రాల్లో బుధవారం సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన సదస్సులు ఇంచార్జి వైద్యాధికారి సాయి చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ వ్యాధి సోకిన వారికి హిమోగ్లోబిన్ శాతం తగ్గి పోతుందన్నారు. ముఖ్యంగా దెబ్బలు తగలకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. రక్తం పెరగడానికి మందులతో పాటు పోషక విలువలు వున్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాధి వున్నవారికి పచ్చకామెర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ పాతాళ రామారావు, హెచ్‌యస్ రమణ, రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట :మండలంలోని తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన సికిల్ సెల్ అనీమియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహిచారు. ఈ సందర్భంగా డాక్టర్ యు.రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు ప్రసాద్, విస్తరణాధికారి విఎ సుబ్బారావు, కె.నర్సింగరావు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆనందపురం : సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహనతోనే సాధికారిత సాధించవచ్చని ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన సదస్సులో మాట్లాడుతూ, రక్తహీనత, కళ్ళు పసుపు రంగులో మారడం, తీవ్రమైన ఒళ్లనొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరుచుగా అంటువ్యాధులు రావడం లాంటి లక్షణాలు కనిపిస్తే, వెంటనే సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ జరిగితే, చికిత్స ద్వారా జీవనాణ్యత పెంచుకోవచ్చన్నారు. పుట్టబోయే శిశువులకు సికిల్‌సెల్ ఎనీమియా సంక్రమించకుండా నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షహనాజ్ సాధియా, సిహెచ్ఓ పి సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు ఎన్ కృష్ణమోహన్, వెలుగు కోఆర్డినేటర్ కె సత్యంనాయుడు, వెలుగు మండల ఎపిఎం జి.నాగభూషణరావు మండల సమాఖ్య ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కశింకోటలో చేపడుతున్న ర్యాలీ



అనితను సత్కరిస్తున్న బుజ్జి

మంత్రి అనితకు అభినందనలు

ప్రజాశక్తి-నక్కపల్లి:అమరావతి సచివాలయంలో బుధవారం హెూం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వంగలపూడి అనిత కు స్థానిక టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పెద్దిరెడ్డి చిట్టిబాబు, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, పార్టీ యువ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి తదితరులు హెూం మంత్రి అనితను కలిసి, శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



శిక్షణ ఇస్తున్న రాంబాబు

యోగా శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం నుంచి యోగా శిక్షణా తరగతులను ప్రారంభ మయ్యాయి. హైస్కూల్ హెచ్ఎం కవిత, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకులు యేడిద వెంకట రమణ, పీడీ ఆదిలక్ష్మి యోగా శిక్షణా తరగతులను ప్రారంభించారు.వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి యోగా ట్రైనర్ దవరసింగి రాంబాబు పిల్లలకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్ఎం కవిత మాట్లాడుతూ, విద్యార్థులు నిత్యం యోగా సాధన చేయడంతో మంచి ఆరోగ్యం, జ్ఞాపకశక్తి కలుగుతుందన్నారు. యోగా శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమన్వయంతోనే అభివృద్ధి

-మండల సమావేశంలో ఎంపిపి మణికుమారి



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గిరిబాబు

ప్రజాశక్తి-గొలుగొండ:అధికారులను సమన్వయంతో చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపిపి గజ్జలపు మణికుమారి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. శాఖల వారీగా సమీక్షలు చేశారు. గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు తమ గ్రామంలో శ్మశానవాటిక, రోడ్డును ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టాలని కోరారు. పుత్తడిగైరంపేట, ఏఎల్ పురం సర్పంచ్‌లు పత్తి రమణ, లోచల సుజాత మాట్లాడుతూ, తమ గ్రామాల్లో దేవాలయాలపై విద్యుత్ లైన్లు వేలాడుతున్నాయని, వాటిని సరి చేయాలని కోరారు. పాముకాటుకు ఇంజక్షన్ అందుబాటులో ఉంచాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. దీనిపై గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, పాముకాటు మందు అందుబాటులో ఉందన్నారు. కాటు నిర్ధారణ తర్వాత రోగికి వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు మాట్లాడుతూ, ప్రస్తుతం మంజూరైన అభివృద్ధి పనులు గ్రామాల్లో పూర్తయ్యే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, ఎంపిడిఓ రత్నకుమారి, ఈఓపిఆర్‌డి రమణి, పరిపాలనాధికారి సత్యనారాయణ, ఎస్సైలు ఉపేంద్ర, కృష్ణారావు, ఆర్అండ్‌బి జేఇ ప్రసాద్, వైద్యాధికారులు ధనుంజై అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

నర్సరీలను పరిశీలించిన అటవీ అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ:కృష్ణదేవిపేట రేంజ్ పరిధిలోని నర్సరీలను ట్రైనీ డీఎఫ్ఓ అబ్దుల్ రఫూఫ్, కేడిపేట రేంజర్ వెంకట్రావు, సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సరీల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గొలుగొండ పరిధిలోని అచ్చియ్యపేట నర్సరీలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించారు.

గొలుగొండలో భారీ వర్షం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో బుధవారం సాయంత్రం ఉరుముగాలుతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణంలో ఉక్క పోతతో తీవ్ర స్థాయిలో వేడి గాలులు వీచాయి. దీంతో మండల వాసులు ఉక్కపోత, ఎండవేడిమితో అల్లాడిపోయారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కృష్ణదేవిపేట, గొలుగొండ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.



కురుస్తున్న వర్షం

బీమా మిత్రల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:బీమా మిత్రల సమస్యలను పరిష్కారంకు కృషి చేస్తానని నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రడు అన్నారు. ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలంటూ బీమా మిత్రలు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమా మిత్రలు మాట్లాడుతూ, రాష్ట్రంలో 1800 మంది చంద్రన్న బీమాలో భీమా మిత్రలుగా పని చేస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్ధాంతరంగా తొలగించారని చెప్పారు. రాష్ట్రంలోని 1800 మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీమామిత్రలు

పాఠశాలలను శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక మండల గిరిజన సంక్షేమశాఖ సహాయ అధికారి మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో బుధవారం ఆయన సందర్శించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ నిర్వాహణ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతోపాటు వసతి గదుల్లో విద్యుత్తు మరమ్మతు పనులు చేయించుకోవాలన్నారు. చుట్టూ పరిసరాలల్లోని పేరుకు పోయిన తుప్పలను తొలగించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎఫిడమిక్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు కాచీ చల్లార్చిన నీటిని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో మూడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలు జరుగుతున్నాయని, ప్రవేశాలు కోరే గిరిజన విద్యార్థుల కుటుంబాలకు అవగాహన పరిచి పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రాపౌట్స్ లేకుండా ప్రవేశాలు చేయించాలని ఆయన ఆదేశించారు.

ఐదుగురికి షోకాజ్ నోటీసులు జారీ

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (గవర్నమెంట్ హైస్కూల్) లో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు, ఒక జూనియర్ అసిస్టెంట్ కు అల్లూరి సీతారామరాజు డీఈఓ బ్రహ్మాజీరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఆలస్యంగా హాజరు కావడం, సమయానికి ఫేషియల్ హాజరు వేసుకోక పోవడం వంటి కారణాలపై హైస్కూల్ కి చెందిన ఉపాధ్యాయులు, జూనియర్ అసిస్టెంట్‌లకు నోటీసులు జారీ చేశారు.



తూనిక యంత్రంలో పరిశీలిస్తున్న తహశీల్దార్

గిడ్డంగిని తనిఖీ చేసిన తహశీల్దార్

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో పౌర సరఫరాల గిడ్డంగిని తహశీల్దార్ వెంకటరమణ పరిశీలించారు. గోదాముకు వస్తున్న సరుకు వివరాలను ఇన్చార్జి మీనాక్షిని అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు సకాలంలో సరుకులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వచ్చిన సరుకులను కాటా వేసి పరిశీలించారు. గోదాముల నుంచి సకాలంలో సరుకు డిపోలకు పంపాలని, నాణ్యత లోపించిన సరుకు గోదాముకు వస్తే తీసుకోవద్దని ఆమెకు సూచించారు.

పాము కాటుతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని బూర్జ పంచాయతీ వాసనరంగని గ్రామంలో పాము కాటుకు గురై ఓ విద్యార్థి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బూర్జ పంచాయతీ వసనరంగని గ్రామానికి చెందిన కిల్లో భాను (14) జి.బొడ్డపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మంగళవారం రాత్రి పడుకున్నప్పుడు సుమారు రెండు గంటల సమయంలో మెడ దగ్గర కట్ల పాము కాటు వేయడంతో తెల్లవారుజామున అరకు ఏరియా ఆస్పత్రిలో తరలిస్తుండగా ప్రాణాలు విడిచినట్లుగా కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బండారు జన్మదిన వేడుకలు



దేవరాపల్లిలో కేక్‌ను తినిపిస్తున్న నేతలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వేచలంలో ఎంపీటీసీ రెడ్డి లక్ష్మి, బలరాం ఆధ్వర్యంలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీను కుక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.సూర్యనారాయణ, శరకాన సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, గొర్లి దేవుళ్ళు, చల్ల నానాజీ, పెద్దాడ వెంకటరమణ, ఇతర నాయకులు కార్యకర్తలు బుధవారం బండారు సత్యనారాయణమూర్తిని ఆయన స్వగ్రామంలో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

సబ్బవరం : మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పుట్టినరోజు సందర్భంగా అనకాపల్లి జిల్లా తెలుగు యువత అధ్యక్షులు పిబివిఎస్ఎన్ రాజు బండారును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజు వెంట మాజీ ఎంపీపీ గండి దేముడు, టిడిపి నేతలు కోరాడ శ్రీనివాసరావు తదితరులున్నారు.

పరవాడ : బండారు సత్యనారాయణమూర్తి పుట్టినరోజు సందర్భంగా టిడిపి పరవాడ గ్రామ శాఖ ఆధ్వర్యాన పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైలా చిన అక్కునాయుడు, పైలా బుజ్జి, పైలా కృష్ణ, వర్రి చంద్రశేఖర్, పోతల గోపి, పైలా అప్పలనాయుడు (ఆప్పి) పాల్గొన్నారు.



మాడుగులలో బండారును సత్కరిస్తున్న నేతలు



సబ్బవరంలో బండారును సత్కరిస్తున్న నేతలు

మాడుగుల: మాడుగులలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జన్మదిన వేడుకలు బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామనాయుడు, నియోజకవర్గ తెలుగుదేశం ఇన్చార్జి పి విజి కుమార్, మాడుగుల సీనియర్ నాయకుడు పుప్పాల అప్పలరాజులు కేక్ కట్ చేశారు. నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సత్యనారాయణమూర్తి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, మాడుగుల టౌన్ ప్రెసిడెంట్ రంజిత్ వర్మ, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, యువ నాయకుడు పుప్పాల లక్ష్మీనారాయణ, కొట్యాడ మల్లికార్జునుడు, ఎస్సి సెల్ అధ్యక్షుడు మరువాడ ఈశ్వరరావు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్, నేతలు

కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు గరికిన సోమేష్ కేన్సర్ బారిన పడ్డాడు. వైద్యం నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమ వుతున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మైలపల్లి సత్యనారాయణ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి సోమేష్‌ను ఆర్థికంగా ఆదుకునేందుకు ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. కూలీలంతా 1 లక్ష 30 వేల నగదును సమకూర్చారు. బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ మైలపల్లి సత్యనారాయణ ఉపాధి కూలీలతో కలిసి క్యాన్సర్ బాధితుడు గరికిన సోమెష్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, గోసల స్వామి, నూకరాజు, చోడిపల్లి నాగేష్, జగ్గా కాశీ రావు, సోమేశ్, నాగరాజు, సూరి, సత్తయ్య సూరిబాబు, రాంబాబు, గోవిందు, కారే దేవుడు పాల్గొన్నారు.

అయ్యన్న హుందాగా వ్యవహరించాలి

-మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఎమ్మెల్యే అయ్యన్నకు స్పీకర్ పదవి రావడం హర్షణీయమని, ఆ పదవికి తగ్గట్టు హుందాగా వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సూచించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా రోడ్డు వేశామో లేదో చూడాలి తప్పా ఏ నిధులతో వేశారన్నది ముఖ్యం కాదన్నారు. అధికారులను నడి రోడ్డుపై నిలబెట్టి దూషించడంతో వారి కుటుంబ సభ్యులు ఎంత బాధపడతారో ఒకసారి అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నాణ్యత లేకపోతే చర్యలు తీసుకోవాలి తప్పా ఇటువంటి ఆరోపణలు తగదన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ 6 పథకాలను అమలు చేయాలన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ఆశ్రమ పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్‌కృష్ణ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జీ.మాడుగుల మండలం కొక్కిరపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్‌కృష్ణ అధికారులను కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ పాఠశాలలో అడ్మిషన్ల కోసం సుమారు 40 మంది విద్యార్థినులు, వీరి తల్లిదండ్రులు గత కొద్ది రోజులుగా నిరీక్షిస్తున్నారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీట్లు ఖాళీ లేవని చెబు తున్నారని, ఈ ప్రాంతంలోని పలువురు విద్యార్థినీలు ఈ పాఠశాలలో చేరేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ మేరకు బుధవారం అడ్మిషన్ల కోసం వచ్చి పలువురు విద్యార్థినిలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. పాఠశాలల్లో చేరేందుకు సీట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఖాళీలు లేవని హెచ్ఎం లు చెబుతున్నారని చెప్పారు. పాఠశాలలో సీట్లు లేక గిరిజన విద్యార్థినులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. బాలికలు విద్యకు దూరమైతే బాల్య వివాహాలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.ఏజెన్సీ ప్రాంత విద్యాభివృద్ధికి ప్రతి విద్యార్థినికి అడ్మిషన్లు కల్పించే విధంగా సీట్లు కేటాయించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చెప్పడతామని ఆయన హెచ్చరించారు.

మెనూను అమలు చేయాలి

ప్రజాశక్తి-కొత్తకోట: పాఠశాలలలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని కొత్తకోట సర్పంచ్ లోవరాజు అన్నారు. కొత్తకోట పియస్ఆర్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యా అభివృద్ధి కి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటి అమలు బాధ్యత ఉపాధ్యాయుల దేన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవా తదితరులు పాల్గొన్నారు.



వంటకాలు పరిశీలిస్తున్న సర్పంచ్



పరీక్షిస్తున్న వైద్యాధికారి

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక అబీద్ సెంటర్‌లో శ్రీషిర్డీసాయి బాబా ఆలయంలో శ్రీ షిర్డీసాయి సేవా సమాజ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 98 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 38 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు ఈ కార్యక్రమంలో లంకా ఈశ్వరరావు, అర్చకులు రాజేష్, రామారావు, శంకర్ పౌండేషన్ కంటి డాక్టర్ శ్రీనిజ, క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్, కోఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.



వృథాగా ఉన్న జనరేటర్, ఇన్‌వర్టర్

తహశీల్దార్ కార్యాలయంలో...

నిరుపయోగంగా జనరేటర్, ఇన్వర్టర్

ప్రజాశక్తి-కోటవురట్ల: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వివిధ పనులకు ఆటంకం లేకుండా ఉండేందుకు గత ప్రభుత్వాలు లక్షల రూపాయలు ఖర్చు చేసి జనరేటర్, ఇన్వర్టర్ ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణ పట్ల అధికారులు పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కోటవురట్ల తహసిల్దార్ కార్యాలయానికి ఇచ్చిన జనరేటర్ దశాబ్ద కాలంగా నిరుపయోగంగానే దర్శనమిస్తుంది. సిబ్బంది కంప్యూటర్లపై వివిధ దరఖాస్తులు నమోదు, స్కానింగ్ సహా తదితరు పనులు చేసుకునేందుకు విద్యుత్తు లేనప్పుడు ఆటంకం కలగకుండా ఉండేందుకు జనరేటర్ కు మూడు లక్షల ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. ఇది ఎండకు ఎండి వానకు తడుస్తూ ఉండటం విశేషం. అలంకార ప్రయంగా ఉన్న జనరేటర్ పనిచేయక పోవడంతో విద్యుత్ సరఫరా లేనప్పుడు దరఖాస్తుదారులు ధ్రుపత్రాలు కోసం కార్యాలయాల వద్ద విద్యుత్తు వచ్చేవరకు ప్రదర్శనలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.జనరేటర్ సక్రమంగా వినియోగించక పోవడంతో ఇన్వర్టర్ సదుపాయం కల్పించారు. ఇది కూడా ప్రస్తుతం అలంకార ప్రాయంగానే దర్శనమిస్తుంది.విద్యుత్తు లేనప్పుడు ప్రజలు, సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకు రావాలన్నారు.